

ప్రముఖ నటులు కైకాల మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రముఖ నటులు, నిర్మాత, మాజీ ఎంపీ కైకాల సత్యనారాయణ మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ తరపున జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సత్యనారాయణ పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో పలు విభిన్నమైన పాత్రలు పోషించారని, పార్లమెంటు సభ్యులుగా సేవలందించారని తెలిపారు. కైకాల మరణం సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

పాతవి తీస్తారు.. కొత్తవి ఇస్తారు..!

పింఛన్ల ఏరివేతకు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు

ప్రతి సచివాలయ పరిధిలో 5 నుంచి 15 పింఛన్లు కోత

వాటి స్థానంలో జనవరిలో కొత్త పింఛన్లు

విద్యుత్ బిల్లుల సాకుతో ఏరివేతకు ప్రణాళిక

రెండు జిల్లాల్లో పింఛన్ లబ్ధిదారులు 4.83 లక్షల మంది




ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఒక ప్రాణం తీశా.. మరో ప్రాణం పోశా.. లెక్క సరిపోయింది' అంటూ ఓ సినిమాలో విలన్ చెప్పిన డైలాగ్ సామాజిక పింఛన్ల మంజూరులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు అతికినట్లు సరిపోతుంది. ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్ల మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అదే సమయంలో ఆరు నెలలకోసారి విద్యుత్ బిల్లులతోపాటు అనేక సాకులు చూపుతూ ఉన్న పింఛన్లను తొలగించే ప్రక్రియకు సైతం ప్రభుత్వం పూనుకుంటుంది. ప్రభుత్వం చెప్పిన ప్రకారం వచ్చే జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 2.65 లక్షల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 2.18 లక్షల మంది సామాజిక పింఛన్లు అందుకుంటున్నారు. వీటిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు వంటి పలు రకాల పింఛన్లు ఉన్నాయి. అర్హత ఉండి కూడా అనేక మందికి పింఛన్లు అందని పరిస్థితి ఉంది. వీరంతా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఆరు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వారు ఏలూరు జిల్లాలో దాదాపు పది వేల మంది ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో ఐదువేలకుపైగా కొత్త పింఛన్లకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం ఉన్న పింఛన్లను తొలగించేందుకు పూనుకుంది. పింఛను అందుకుంటున్న వారి కరెంటు బిల్లులను ఆరు నెలల సరాసరి పరిశీలించి 300 యూనిట్లు దాటితే పింఛన్ నిలిపివేస్తోంది. ఈ కాలంలో ఇంట్లో ఏదైనా వివాహం, వేరే వేడుకలు జరిగి విద్యుత్ బిల్లు పెరిగితే పింఛన్ ఆగిపోయినట్టే. ఇలా పలు నిబంధనలను తెరపైకి తెచ్చి పింఛన్లను ఆపేస్తోంది. పరిశీలన పేరుతో ప్రతి సచివాలయ పరిధిలో ఐదు నుంచి 15 పింఛన్లు వరకూ ఏరివేత జాబితాలో చేరాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 1165 వరకూ గ్రామ, పట్టణ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయ పరిధిలో పది పింఛన్లు ఏరివేసినా 11 వేలకుపైగా పింఛన్లు నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఏరివేత జాబితా సంఖ్య గురించి ఏఒక్క అధికారీ సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. 20, 30 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లకు విద్యుత్ మీటర్లన్నీ దాదాపుగా ఇంటి పెద్ద పేరుపైనే ఉన్నాయి. కుమారులు ఆ ఇంట్లో ఉంటున్నప్పటికీ పింఛన్ అందుకుంటున్న వ్యక్తి పేరుపైనే విద్యుత్ మీటర్ నడుస్తోంది. కుమారులు విద్యుత్ వాడుకుంటే ఏసంబధం లేని వృద్ధుల పింఛన్ ఆపేస్తున్నారు. ఇలాంటివి అనేక ఇబ్బందులు ఉన్నాయి.

పింఛన్ల మాయ

ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఏరివేసిన పింఛన్ల గురించి మాత్రం చెప్పడం లేదు. కొత్త పింఛన్లు ఎన్ని మంజూరు చేస్తే దాదాపు అదేస్థాయిలో పాత పింఛన్లు తొలగిస్తున్నారు. పింఛన్లు సంఖ్య పెరగకుండా ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పింఛన్ల ఏరివేతకు సంబంధించిన వివరాలు డిఆర్‌డిఎ కార్యాలయ సిబ్బంది తమకు తెలియదని చెబుతున్నారు. నేరుగా సచివాలయ సిబ్బంది లాగిన్‌లోకి పంపించి పింఛన్ల ఏరివేత చేపడుతున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ వంటి రాష్ట్రంలో 300 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ ఇస్తుంటే ఇక్కడ మాత్రం మూడొందల యూనిట్లు విద్యుత్ వాడుకుంటే సంక్షేమ పథకాలు ఆపేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో కొత్త పింఛన్ల మంజూరులో ప్రభుత్వ కపట నాటకం ఆడుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జనవరి నుంచి రూ.2500గా ఉన్న పింఛన్ రూ.2,750కు పెరగనుంది. ఈ తరుణంలో పింఛన్ల ఏరివేత ఎంతోమంది లబ్ధిదారులకు తీరని వేదన మిగుల్చుతోంది.



మాజీ ఎంఎల్‌సి శర్మను సత్కరిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సూర్యనారాయణగుప్త, సభ్యులు, ప్రముఖులు

ఆర్థిక వ్యవస్థపై యువత దృష్టి సారించాలి

కార్పొరేట్ల విన్యాసాలు, ప్రభుత్వ విధానాల ఫలితమే మాంద్యం

సదస్సులో మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాయడం వల్లే సామాన్యులు కొనుగోలు శక్తి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నారని, ఆర్థిక వ్యవస్థపై యువత దృష్టి సారించి కార్పొరేట్ శక్తుల ఆగడాలను అడ్డుకున్ననాడే దేశ పురోగతి సాధ్యమని మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ అన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా 'ప్రపంచ ఆర్థిక మాంద్యం-కారణాలు-పరిష్కారాలు' అనే అంశంపై సెమినార్ శుక్రవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్త శర్మ మాట్లాడుతూ కార్పొరేట్ల వ్యాపార విన్యాసాలతో ఆర్థిక మాంద్యం ముంచుకొస్తుందన్నారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. గతంలో విద్య, వైద్యం కొంత బాగున్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వాలు ఈ రెండింటినీ పక్కన పెట్టేశాయన్నారు. ఉపాధి హామీ చట్టం కింద అవసరమైన పనులు చేయించుకోవచ్చని, అయితే ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూడం దారుణమని అన్నారు. గతంలో శాసనమండలిలో తాను విశాఖ జిల్లా గంగవరం పోర్టుకు ఎకరం రూపాయి చొప్పున 1800 ఎకరాలు ఇవ్వడంపై ప్రశ్నించగా ఉచితంగా ఇవ్వడానికి చట్టం ఒప్పుకోదని నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చెప్పారన్నారు. కార్పొరేట్ రాజు బ్యాంకుల్లో అప్పు తెచ్చి అక్కడ 29 బెర్త్‌లు కట్టగా అదానికి ఆ బెర్త్‌లు అమ్మినప్పుడు ఈ ముఖ్యమంత్రి ఏమీ మాట్లాడకుండా కాగితం రాసి ఇచ్చారన్నారు. కరోనా సమయంలో అమెరికా వంటి దేశాలు ప్రజలపై పన్నుల భారం తగ్గించడమే కాకుండా ఇంటి అద్దెలు కూడా చెల్లించాయని గుర్తు చేశారు. అయితే మన దేశంలో మాత్రం కరోనా సమయంలో చాలా నష్టపోయామని ప్రధాని చెబుతున్నారని, ఒక్క పెట్రోల్, డీజిల్‌పై అదనపు పన్ను వేసి రూ.6.30 లక్షల కోట్లు వసూలు చేశారన్నారు. అదే సమయంలో వలస కూలీలు కాలినడకన వెళ్తూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. కార్పొరేట్లకు రాయితీల మీద రాయితీలు ఇస్తూ సామాన్య ప్రజల నుంచి ఇంటి పన్ను కూడా మార్కెట్ విలువ ప్రకారం వసూలు చేస్తున్నారన్నారు. పెద్దనోట్ల రద్దు ఎన్నికల కోసం కాదని, చిరు వ్యాపారులను నాశనం, కార్పొరేట్ శక్తుల బాగు కోసమేనని అన్నారు. దేశంలో చిరువ్యాపారులు నాలుగు కోట్ల మంది, రోడ్డు పక్కన, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునేవారు 11 కోట్ల మంది ఉన్నారన్నారు. ఇదే సమయంలో డీమార్ట్, వాల్‌మార్ట్ వంటి షాపింగ్‌మాల్స్ వల్ల కేవలం కోటీ 25 వేల మందికి మాత్రమే ఉపాధి దొరుకుతుందని, మిగిలినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. యువత ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించకపోతే ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్ని బాబూరావు, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు బి.బలరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులు నిలబడాలంటే కార్పొరేట్లను అడ్డుకోవాలి

మానేపల్లి సూర్యనారాయణగుప్త, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు

కుటుంబ పోషణ కోసం చిరు వ్యాపారులు తరతరాలుగా వ్యాపారాలు చేస్తున్నారు. నేడు కార్పొరేట్ శక్తులు పెద్దపెద్ద మాల్స్ పెట్టడంతో చిరు వ్యాపారులు నాశనమవుతున్నారు. దీంతో వ్యాపారాలు చేయాలో, మానాలో తెలియని పరిస్థితుల్లో చిరువ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు.

ఆర్థిక వ్యవస్థపై అవగాహన తప్పనిసరి

కె.సత్యాదేవి, ప్రముఖ న్యాయవాది

సమాజ అభివృద్ధిలో యువతే కీలకం. ఆర్థిక వ్యవస్థపై యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలి. కార్పొరేట్ శక్తుల వల్ల రైతులు, సామాన్యులు కూడా ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో చెప్పేందుకు యువత చొరవ చూపాలి.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



భీమడోలులో

వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నెక్కలం గొల్లగూడెం గ్రామంలో సిఐటియు రాష్ట్ర మహాసభ కరపత్రాలను పంపిణీ చేవారు. అనంతరం కుశలవ ఇంటర్నేషనల్ కంపెనీ వద్ద కార్మికుల మధ్య గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆగిరిపల్లి మండల ప్రధానకార్యదర్శి ఆర్.చంటి, కుశలవ యూనియన్ నాయకులు ప్రసాద్, నరేష్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నిడమర్రు : సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ భువనపల్లిలో సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడగా నాయకులు గవర సత్యనారాయణ, లింగబరి లక్ష్మణరావు, ప్రగడ మణికంఠ, బాలాజీ, శ్రీను, వినయ్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భారతి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సమావేశం జి.విమల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భారతి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాల అమలు చేయడం లేదన్నారు. అనంతరం అంగన్వాడీ ప్రాజెక్టు నూతన కమిటీని 16 మందితో ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా శుక్లబోయిన రాంబాబు, అధ్యక్షులుగా జి.విమల, కార్యదర్శిగా ఎ.నాగవేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్‌కె.సుభాషిని, సిఐటియు నాయకులు జి.విజయలక్ష్మి, ఎస్.రాంబాబు, జి.విజయకుమారి, లక్ష్మీదేవి, విజయనిర్మల, సత్యవేణి పాల్గొన్నారు.

భీమడోలు: కొత్త ఏడాది పోరాటాల సంవత్సరంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అభివర్ణించారు. సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పోరాడాల్సి ఉందని, వీరికి సిఐటియు అండగా నిలుస్తుందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర 16వ మహాసభ గోడపత్రికను స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఒప్పంద, పొరుగు సేవలు కార్మికులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో భీమవరంలో జరిగే ఈ సభలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సాల్మన్‌రాజు, స్టేషన్ కార్మికులు బాజీ, నాగేశ్వరరావు, మోహన్ పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కె.లాజర్ పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ఆగిరిపల్లిలో..

భూమికి భూమి ఇవ్వాలని పేదల ధర్నా

జగనన్న ఇళ్లు పేరుతో పేదల భూములను లాక్కోవడం తగదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

భూములు కోల్పోయిన పేదలకు భూమికి భూమి, నష్టపరిహారం ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ముసునూరు మండలం బలివే రెవెన్యూ పరిధిలోని రంగంపేట గ్రామంలో పేదలకు 1990లో అప్పటి ప్రభుత్వం సీలింగ్ భూములు పంపిణీ చేసిందని, ఈ భూములకు పట్టా, పాస్‌బుక్ ఇచ్చిందని తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో పేదలకు చెందిన భూములను దౌర్జన్యంగా, పోలీసులతో భయపెట్టి రెవెన్యూ శాఖాధికారులు లాగేసుకున్నారని మండిపడ్డారు. నేటికీ ఆ పేదలకు ఎలాంటి నష్టపరిహారమూ అందకపోగా మండలస్థాయి రెవెన్యూ అధికారులు మీకు దిక్కున చోట చెప్పుకోండని అవమానకరంగా మాట్లాడటం దారుణమన్నారు. ఈ భూములు మీవి కావని రెవెన్యూ అధికారులు పేదలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. పేదల భూములను లాక్కుంటున్న అధికారులకు భూస్వాముల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన పేదలకు పట్టా, పాస్ బుక్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కూడా ఇస్తుందని, అటువంటి భూమిని ఎలా లాక్కుంటారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పేదల భూములు పేదలకే ఉంచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదలందరినీ ఐక్యం చేసి పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఆర్.ఎల్లమ్మ, సీతారాం, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు డిపోవద్ద ఆర్‌టిసి ఉద్యోగులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణం విడుదల చేయాలని, ఓవర్ టైమ్ చేసిన ఉద్యోగులకు మూడు నెలలుగా ఓటి అలవెన్సులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ వైద్యం అందక అకాల మరణాలు పెరుగుతున్నాయని, ఇహెచ్‌ఎస్ స్థానంలో గతంలో ఉన్న ఆర్‌టిసి వైద్యాన్నే కొనసాగించాలని, ఉద్యోగులకు సత్వర సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.అరుణ కుమారి మాట్లాడుతూ మహిళల సమస్యలపై ఇచ్చిన సర్క్యులర్ ప్రమాణాలు అమలుకావడం లేదన్నారు. ఆర్‌టిసిలో అద్దెబస్సులతో ప్రయివేటీకరణ ఆపాలని, ఆర్‌టిసి బస్సులు పెంచాలని, ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీనివాసుడు, ఎస్.సురేష్, డిపో అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.ప్రసాద్, టికె.రావు, ఎండి.హుస్సేన్, ఎ.రమేష్, విపి.రావు, సిహెచ్‌ఎస్.నారాయణ, ప్రసాద్, పి.వెంకన్న పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఉంగుటూరు మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం హైస్కూల్లో యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. యుటిఎఫ్ మండల అధ్యక్షులు గొల్లపల్లి రామారావు అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. తొలుత ప్రధానకార్యదర్శి మందపాటి శ్రీనివాస్ నివేదికను సమర్పించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని, పెండింగ్ డిఎ చెల్లించాలని, పిఎఫ్ రుణాలు ఇవ్వాలని. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా శీతాల సత్యనారాయణ, అధ్యక్షులుగా ఉనుగుల రాంబాబు, ప్రధానకార్యదర్శిగా డాకి జోగినాయుడు, ఉపాధ్యక్షులుగా కె.హరికృష్ణ, ఆకివీడు వాణి, కోశాధికారిగా ఊట ఆనంద్ కుమార్, ఆడిటర్‌గా టి.శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు రవికుమార్, పివి.నరసింహారావు, తేరా ప్రసాద్, శివప్రసాద్ పరిశీలకులుగా వచ్చారు. అల్లు శ్రీను, శ్రీధర్, బొమ్మిడి ప్రసాద్, పుప్పాల నరసింహారావు, ప్రసాదరాజు, కమల్ కుమార్, ఉప్పిలి వెంకటేశ్వరరావు, శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో రాకేష్ ప్రతిభ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలో అండర్-19 బాలుర విభాగంలో తృతీయ స్థానం సాధించిన జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బట్టు రాకేష్ పలువురు అభినందించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తృతీయ స్థానం సాధించిన రాకేష్‌ను కళాశాల యాజమాన్యం, స్థానికవాసులు ప్రత్యేకంగా అభినందించారు.

జి.కొత్తపల్లిలో పారిశ్రామిక పార్కు

పిఎంఇజిపి కింద సవరించిన లక్ష్యాలు సాధించాలి

జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ఏలూరు: ద్వారకా తిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూమిని గుర్తించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఎపిఐఎసి జోనల్ మేనేజర్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌బాబు మాట్లాడుతూ జి.కొత్తపల్లి గ్రామాన్ని సంబంధిత తహశీల్దారుతో కలిసి సందర్శించి పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు అవసరమైన వందెకరాల భూమిని గుర్తించాలన్నారు. పిఎంఇజిపి పథకం కింద స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం, కెవిఐబి, కెవిఐసి మూడు ఏజెన్సీలు మరిన్ని దరఖాస్తులు స్పాన్సర్ చేయాలని, అదేవిధంగా సవరించిన లక్ష్యాలను సాధించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద బ్యాంకు శాఖల్లో పెండింగులో ఉన్న దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని లీడ్ బ్యాంక్ మేనేజరును ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని సభ్యులకు మెమో జారీ చేయాలని అరుణ్‌కుమార్ ఆదేశించారు. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద జిల్లాలో చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, విద్యుత్ సబ్సిడీ, తదితర ప్రోత్సాహకాలకు అందిన దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించింది. 41 యూనిట్లకు రూ.3.50 కోట్లు రాయితీల మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. సింగిల్ విండో కింద పరిశ్రమల ఏర్పాటుకు 185 దరఖాస్తులురాగా వాటిలో 178 దరఖాస్తులు నిర్దేశించిన సమయంలోనే ఆమోదం పొందాయన్నారు.

ధాన్యం కొనే నాథుడే లేడు



తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు వరి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తేమశాతం పేరుతో మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మండలంలో గత మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖరీఫ్ మాసూళ్లు పూర్తయిన రైతులు తమ ధాన్యాన్ని సంచుల్లోకి నింపి ట్రాక్టర్లలోకి ఎగుమతి చేసినా ఆర్‌బికెల సిబ్బంది పట్టించుకోకపోవడం రైతులను ఆగ్రహానికి గురి చేసింది. ధాన్యపు లోడు ట్రాక్టర్లతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు.

అందుబాటులో లేని అధికారులు

తొలుత రైతులు ధాన్యం కొనుగోలు విషయమై మాట్లాడేందుకు ఉదయం 10.30 గంటలకు మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికి వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ కార్యాలయానికి రాలేదు. నిరీక్షించినా సదరు అధికారి రాకపోవడంతో తహశీల్దార్‌ను కలిసేందుకు అంతా 11 గంటలకు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. కొద్దిసేపటికి తహశీల్దార్ రాగా రైతులంతా ఆయనను కలిసేందుకు వెళ్లబోగా సిబ్బంది అడ్డుకున్నారు. వాగ్వివాదం అనంతరం లోనికి రైతులను అనుమతించారు.

సాయంత్రంలోగా సమస్య పరిష్కరిస్తాం

తహశీల్దార్ కె.శ్రీనివాసరావు

ధాన్యం కొనుగోలు సమస్యపై రైతులు తహశీల్దార్‌తో చర్చించారు. చర్చల అనంతరం రైతులు విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల్లోపు ధాన్యం లోడులు దిగుమతి చేసేలా ఉన్నతాధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని తహశీల్దార్ శ్రీనివాసరావు హామీ ఇచ్చారని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమస్య పరిష్కారం కాకపోతే శనివారం ఆందోళన చేపడతామని వారు ప్రకటించారు.

'ప్రజాశక్తి'పై తహశీల్దార్ రుసరుసలు

రైతులు తమ సమస్యను తహశీల్దార్‌కు వివరించేందుకు ఆయన ఛాంబర్‌లోకి వెళ్లగా సమాచారం తెలిసి వార్తను కవర్ చేసేందుకు ప్రజాశక్తి విలేకరి ఆ ఛాంబర్‌లోకి వెళ్లారు. దీంతో ఒక్కసారిగా తహశీల్దార్ శ్రీనివాసరావు 'ఎవరు మీరు, ఎందుకొచ్చారు, ఇక్కడ మీకు పనేంటి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. రైతులు పిలిస్తేనే తాను వార్త కవరేజీకి వచ్చానని, చర్చల వివరాలు తర్వాత తెలపండని విలేకరి బయటకు వచ్చేశారు.



ధాన్యం కొనుగోలు చేయడంలేదు

నాని, రైతు, వడాలి

మూడు రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. బ్యాంక్ గ్యారంటీ రైస్‌మిల్లుకు లేదని అధికారులు రైతులతో అంటున్నారు. మూడు రోజులుగా ధాన్యం అన్‌లోడు చేయడం లేదు. వేబిల్లు రావడానికి రెండు రోజులు సమయం పడుతుంది. మిల్లర్‌కు బ్యాంక్ గ్యారంటీ లేనప్పుడు రైతులకు ఎందుకు సంచులు ఇస్తున్నారు. సంచులు ఇవ్వకపోతే రైతు ఇంటి వద్దే ధాన్యాన్ని రాశులుగా ఉంటుకుంటారు. ఆర్‌బికె అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు రోజులు తరబడి ధాన్యం దిగుమతి కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ధాన్యం తేమశాతంలో తేడాకు ఒక పాయింట్‌కు రూ.20 చొప్పున మిల్లర్‌కు చెల్లించాల్సి వస్తోంది.



అమ్మకం చాలా తలనొప్పిగా మారింది

రామిరెడ్డి సురేంద్రరెడ్డి, రైతు, వడాలి

ప్రభుత్వం పెట్టిన నిబంధనలు రైతులకు తలనొప్పిగా మారాయి. మిల్లుకు బ్యాంక్ గ్యారెంటీ లేక ధాన్యం దిగుమతి చేసుకోలేదు. లోడ్ చేసి మూడు రోజులైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలి.



నిబంధనలు సడలించాలి

పి.వెంకట్రావు, రైతు, చినపాలపర్రు

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులకు ఇబ్బంది లేకుండా నిబంధనలు సడలించి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి. అసలే శీతాకాలం, దానికితోడు రోజు మబ్బుల కారణంగా ధాన్యం ఆరబెట్టినా తేమశాతం తగ్గడం లేదు. ప్రభుత్వ నిబంధనలు సడలించి తడి, పొడి ధాన్యం కొనుగోలు చేయాలి.



ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదు

జె.ప్రసాద్, ట్రాక్టర్ డ్రైవర్. పెయ్యేరు

మిల్లరు వద్దకు ధాన్యం తీసుకొస్తే రోజులు తరబడి ధాన్యం దిగుమతి చేయడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోజుకు రెండు, మూడు ట్రిప్పులు వేసే వాళ్లం. ధాన్యం దిగుమతి కాకపోవడంతో రెండు రోజులకు ఒక ట్రిప్పు కూడా పడటం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.



దళారులకే సంచులు

సిహెచ్.సురేంద్రప్రసాద్, రైతు, చినపాలపర్రు

ఆర్‌బికె అధికారులు దళారులకే సంచులు ఇస్తున్నారు. రైతులకు ఇవ్వడం లేదు. ఆర్‌బికెలో రైతులు సంచుల కోసం రోజులు తరబడి నిరీక్షించాల్సివస్తోంది. శుక్రవారం తహశీల్దార్‌ను కలిశాం. సాయంత్రంలోపు ధాన్యం లోడులు దిగుమతి చేసుకుంటామన్నారు. దిగుమతి చేసుకోకపోతే శనివారం రైతులంతా ముదినేపల్లిలో ఆందోళన చేస్తాం.

పామాయిల్ మొక్కలు అందించాలి

ఆక్వాజోన్ నిర్ధారణపై వినతులను తక్షణమే పరిశీలించాలి

జిల్లాలో రూ.459.74 కోట్లు విలువైన ధాన్యం కొనుగోలు

ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి – ఏలూరు

రైతులకు అవసరమైన పామాయిల్ మొక్కలను త్వరితగతిన పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖాధికారులను ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గౌతమి సమావేశపు మందిరంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం మండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ సాగుకు డిమాండ్ ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని త్వరగా మొక్కలను అందిస్తే అంత రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. దీనిపై ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ పాండురంగ మాట్లాడుతూ ఇతర ఏజెన్సీల నుంచి మొక్కలు సేకరించి జనవరిలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ నిర్ధారణ చేసేందుకు నిర్వహించిన గ్రామ సభల్లో అందిన వినతులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబంధించి ఇంతవరకు 48,047 మంది రైతుల నుంచి రూ.459.74 కోట్ల విలువైన 2.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 12126 మంది రైతులకు రూ.123 కోట్లు చెల్లించారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు సంబంధించి రవాణా కోసం లారీలు అందుబాటులో ఉంచాలన్నారు. ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన విధానంలో ధాన్యం సేకరణకు సంబంధించి ప్రస్తుతం సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు. కమిటీ సభ్యులు వి.హరిబాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ప్రాంతంలో పొగాకు సాగు ఖర్చు పెరిగిన దృష్ట్యా పంట రుణ పరిమితిని పెంచాలని సూచించారు. డ్రిప్ 90 శాతం రాయితీ ప్రతి రైతుకూ అందిస్తే విద్యుత్ ఆదా అవుతుందన్నారు. పామాయిల్ తోటల్లో మధ్యగా వెళ్లిన విద్యుత్ లైన్ల మార్పునకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మండలి సభ్యులు వైఆర్‌కెపిఆర్.బాబ్జీ, పి.రవీంద్రరెడ్డి, చిట్టూరి వెంకటేశ్వరరావు, రైస్‌మిల్లర్ల ప్రతినిధి కె.సూరిబాబు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్లు వై.రామకృష్ణ, జి.నెహ్రూబాబు, ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాండురంగారావు, ఎల్‌డిఎం ఎస్.వెంకటేశ్వరరావు, ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్, ట్రాన్స్‌కో ఎస్ఇ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

తలసేమియాపై చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తల సేమియా భవనంలో 15 మంది తల సేమియా చిన్నారులకు రక్త మార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల సేమియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలను బట్టి వ్యాధి నిర్ధారణ పరీక్షలు డాక్టర్‌ని సంప్రదించి చేయించుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్నం తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 35 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత పాలడుగు వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్ని, డాక్టర్ జి.దివ్యతేజ కిరణ్, ఎస్.విజయ, ఎల్.శిరీష పాల్గొన్నారు.

ఎపిఇఎపి సెట్‌లో లావణ్య ప్రతిభ


ప్రజాశక్తి – ఉంగుటూరు

నారాయణపురంలోని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత ఏడాది ఇంటర్ బైపిసి పూర్తిచేసిన విద్యార్థిని మట్టా లావణ్యకు ఎపిఇఎపి సెట్‌లో 24185 ర్యాంకు సాధించడం అభినందనీయమని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.వి.శ్రీనివాస్ తెలిపారు. లావణ్యకు బి.ఫార్మసీలో నల్లజర్ల ఎశ్వర్‌జి ఫార్మసీ కాలేజ్‌లో సీటు ఎలాట్‌మెంట్ అయిన సందర్భంగా ఆమెను కళాశాలలో సత్కరించారు. నిపుణులైన అధ్యాపకులతో క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించేందుకు కృషి చేస్తున్నట్లు డివిఇఒ బి.ప్రభాకరరావు తెలిపారు.

నీటి నిల్వలు.. దోమలకు ఆవాసాలు

ప్రజాశక్తి – ఉంగుటూరు

నీటి నిల్వలు దోమలకు నిలయాలని, అలాంటివి లేకుండా చూసుకోవాలని మలేరియా నివారణ అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొల్లగూడెం, నల్లమాడు గ్రామాల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం వల్ల వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో పెరుగుతున్న లార్వాను గుర్తించి వాటిని నిర్మూలించాలన్నారు. ప్రతీవారం డ్రై డే నిర్వహించడం వల్ల లార్వాను మట్టు పెట్టొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు పరమేశ్వరి, పూజిత ఆరోగ్య సహాయకులు వెంకటస్వామి, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.




బ్యాంకు సేవలు వివరిస్తున్న దుర్గారావు

ఇండియన్ బ్యాంకు సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి – మండవల్లి

ఇండియన్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను ఖాతాదారులు వినియోగించుకుని లబ్ధి పొందాలని ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండలంలోని పెరికేగూడెం, ప్రత్తిపాడు గ్రామాల్లో సామాజిక భద్రత ఇండియన్ బ్యాంక్ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు గురించి అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఖాతాదారులకు సెల్ఫ్ డిక్లరేషన్‌పై రూ.నాలుగు లక్షల వరకూ, అంతేకాకుండా భూమి ఉన్న వారికి రూ.35 లక్షల వరకూ బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీరేట్లతో రుణ సదుపాయం కలదని ఆయన తెలిపారు. సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల గురించి ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, ప్రత్తిపాడు సర్పంచి బేతపూడి రాజు, మాజీ సర్పంచి తేరా చంద్రకాంత సంధ్య, ఆక్వా ఫ్యాక్టరీ మేనేజర్ నరేష్, రామకృష్ణ, జాస్మిన్, జోజి, మేరీ పాల్గొన్నారు.



'చెత్త నుంచి సంపద'తో

పంచాయతీలకు మంచి ఆదాయం

ప్రజాశక్తి – ఆగిరిపల్లి

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలు తమ ఆదాయ వనరులను పెంపొందించుకోవచ్చని ఇఒపిఆర్‌డి డి.సుహాసిని అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొద్దనపల్లిలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2023పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచి నక్కనబోయిన విజయలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి – జంగారెడ్డిగూడెం

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పాస్టర్లకు హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని సిజిఆర్ టౌన్ హాలులో హోప్ మినిస్ట్రీస్ గెడ్డం డైరెక్టర్ జాషువా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సుమారు 500 మంది పాస్టర్ దంపతులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా సౌత్ కొరియాకు చెందిన పాస్టర్ ఐజాక్ కిమ్ మాట్లాడారు. హోప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ జాషువ గడ్డం మాట్లాడుతూ హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో తాగునీరు లేని అనేక గ్రామాలకు బోర్లు వేయించామని తెలిపారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో రూ.ఎనిమిది లక్షలతో బోర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నిరుపేద వితంతువులకు వస్త్రాలు, రెండు వేల మంది మహిళలకు ఆర్థిక భరోసాగా కుట్టు మిషన్లు, గ్యాస్ కనెక్షన్లు, చిరు వ్యాపారులకు సైకిళ్లు, 500 మంది పాస్టర్లకు మోటార్ సైకిళ్ల అందించామన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.డేవిడ్ రాజు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: స్థానిక గాంధీనగర్‌లోని న్యూ జనరేషన్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వివిధ వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరంలోని ఇండియన్ డిజిటల్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలతో పాటలు పాడుతూ చేసిన నృత్యాలు, నాటికలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ జివి.ప్రసాద్, ప్రిన్సిపల్ జి.పద్మిని దుర్గ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు క్రీస్తు జననాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.సత్యనారాయణ, డీన్ మధుబాబు, ఎఒ రవీంద్ర, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఝాన్సీ, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి గురవమ్మ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 254 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

జాబ్ మేళాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, జసి అరుణ్‌బాబు ఉసూచించారు. బుట్టాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో తెల్లం బాలరాజు, అరుణ్ బాబు పాల్గొన్నారు. గిరిజన యువత పోటీతత్వంతో ముందుకెళ్లాలని వారు సూచించారు. ఈ సందర్భంగా అరుణ్ బాబు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందన్నారు. మొత్తం 650 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. వీరిలో 254 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని తెలిపారు. గిరిజన యువత ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు వారికి అభిరుచి ఉన్న రంగంలో నైపుణ్యాన్ని పెంచుకుని పోటీతత్వంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు, ఆర్‌డిఒక జాన్సీరాని, జెడిఎం పార్థసారధి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మధుభూషణ్, ఎంపిపి కారం శాంతిరమణ, జెడ్‌పిటిసి సభ్యులు రామతులసి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

మండలంలోని సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు, జెసి అరుణ్‌బాబుకు కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యాన వినతులు అందించారు. శుక్రవారం బుట్టాయగూడెం విచ్చేసిన వారిని కెవిపిఎస్, దళిత ప్రజాసంఘాల నేతలు కలిశారు. రాజీవ్‌నగర్ కాలనీలో ఎస్‌సి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 12 సెంట్ల స్థలంలో ఎస్‌సిలకు కల్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని, తక్షణం పనులు చేపట్టాలన్నారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ దాదాపు రెండు వేల మంది జనాభా ఉన్న ఎస్‌సిలకు ఈ కల్యాణ మండపం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు వై.రాజు, జి.సురేష్, డి.శిఖామణి, ఎం.అశోక్ పాల్గొన్నారు



కేక్ కట్ చేస్తున్న బొడ్డు నోబుల్

ఘనంగా ఆనందరావుపేట చర్చి వార్షికోత్సవం

ప్రజాశక్తి – కైకలూరు రూరల్

ఐక్యంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నోబుల్ అన్నారు. మండలంలోని ఆచవరం శివారు ఆనందరావుపేటలో శుక్రవారం సిఎస్ఐ చర్చి మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సిఎస్ఐ సంఘ పెద్దలు, గ్రామస్తులు యువకులు బొడ్డు నోబుల్‌కు ఘనస్వాగతం పలికారు. సిఎస్ఐ చర్చిల పలు డీనరీల ఛైర్మన్లు, ప్యారిస్ పాస్టర్లు సంతోష్, నిరీక్షణ రావు, కొర్నిల్, డేవిడ్ బొడ్డు నోబుల్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నోబుల్ మాట్లాడుతూ సంఘస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ గ్రామానికి ఏ అవసరం ఉన్నా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అందరూ కలిసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచవరం ఎంపిటిసి నాగరాజు, మాజీ సర్పంచి దండే సైమన్‌రాజు, బొడ్డు నాని, దాసరి దానియేలు, తొక్కిడి ఈపు సుదర్శన్, బొడ్డు ఏసుబాబు, దండే మిఖాయేలు, ప్రభాకర్, దండే అహరోను పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న భూ సర్వే

ప్రజాశక్తి – ముసునూరు

రీ-సర్వేకు ముందు భూ రికార్డులను పరిశీలించి ఆ తర్వాత పారదర్శకంగా సర్వే చేస్తున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. శుక్రవారం ముసునూరు, గోపవరం గ్రామాల్లో తహశీల్దార్ దాసరి సుధ, ఇతర రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి జగనన్న భూ సర్వే చేపట్టారు.

తామరకొల్లులో

గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి – కైకలూరు రూరల్

వైసిపికి ప్రజల్లో ఆదరణ పెరిగిందని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తామరకొల్లు సచివాలయ పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, సర్పంచి బట్రాజు శివాజీ, కైకలూరు సర్పంచి నవరత్నకుమారి, ఎంపిడిఒ రామలింగేశ్వరరావు, టౌన్ సిఐ నాగరాజు, పాల్గొన్నారు.

విద్యారంగానికి వైసిపి ప్రాధాన్యత

ప్రజాశక్తి – గణపవరం

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతిస్తుందని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. శుక్రవారం గణపవరం, పిప్పర జిల్లాపరిషత్ హైస్కూళ్ల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. జగన్ ప్రభుత్వం అమ్మఒడి, జగనన్న విద్యా దీవన, వసతి దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దండు వెంకటరామరాజు, ఎంఇఒ పి.శేషు, వైసిపి నాయకులు వడ్డే ఉమామహేశ్వరరావు, కాకర శ్యాము పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు సిఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండలంలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, వైస్‌ఎంపిపి మహ్మద్ జహీర్, ఆటపాక సర్పంచి తలారి మణిజాన్, వైసిపి మండల అధ్యక్షులు భట్రాజు శివాజీ, ఎంఇఒ రామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు రవి ప్రకాష్ పాల్గొన్నారు.

దెందులూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రభుత్వం అందిస్తున్న ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి – భీమడోలు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న కూలీలు

పొలసానిపల్లి పంచాయతీ పరిధిలో లో ఓల్టేజీ, ఇతర విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టినట్లు భీమడోలు ఎఇ రామస్వామి తెలిపారు. సుమారు రూ.4.60 లక్షలతో 63 కెవి సామర్థ్యం గల అదనపు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు పనులు శుక్రవారం చేపట్టినట్లు ఆయన తెలిపారు. సర్పంచి షేక్ రహీమా బేగం హసేన గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్ కో అధికారులతో మాట్లాడారు. ఈ మేరకు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు సహాయ సహకారాలతో అదనపు ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కొన్నిచోట్ల పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో అదనపు సామర్థ్యం గల ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీలో నిర్మాణపు పనులకు అంతరాయంగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చారు. 63 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల సుమారు 250 కుటుంబాలకు లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని సర్పంచి తెలిపారు.

వృద్ధులకు 'మానవత' సాయం

ప్రజాశక్తి – భీమడోలు



సాయం చేస్తున్న మానవత సభ్యులు

మండలంలోని పొలసానిపల్లి, దుద్దేపూడి గ్రామాల్లో శుక్రవారం స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా మానవత జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు. పొలసానిపల్లి, దుద్దేపూడి గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులు వృద్ధులకు నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. వీరికి అవసరమైన దుస్తులను భీమడోలు సాయిరాం క్లాత్ షోరూం వారు సమకూర్చారు. పొలసానిపల్లిలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న మూడు నెలలు చిన్నారి వైద్యం కోసం రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు శాఖ ఛైర్మన్ జి.నూకరాజు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన తర్వాతే ఆడ పిల్లలకు వివాహం చేయాలి

టి.నరసాపురం: 18 ఏళ్లు నిండిన తరువాతే ఆడపిల్లలకు వివాహం చేయాలని మండల వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ సూచించారు. మక్కినవారిగూడెంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ పిక్స్ డే కార్యక్రమంలో 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు పలు సూచనలు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. 10 నుండి 19 సంవత్సరాల ఆడపిల్లలు క్రమం తప్పకుండా ప్రతీ గురువారం ఇచ్చే ఐరన్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.ప్రసాద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ యు.రాజారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి – భీమడోలు

స్పందన ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. వివరాలిలా ఉన్నాయి. గుండుగొలను – కొవ్వూరు జాతీయ రహదారి పున:నిర్మాణంలో జాతీయ రహదారుల శాఖ మురుగునీరు ప్రవహించే డ్రెయిన్లను ఎత్తుగా నిర్మించారు. దీనివల్ల సూరప్పగూడెం గ్రామం నుంచి బయటకు వెళ్లే మురుగునీరు గ్రామంలోనే ఉండిపోతుంది. దీంతో గ్రామస్తులు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ పెంచల కిషోర్ సూరప్పగూడెం గ్రామాన్ని శుక్రవారం సాయంత్రం సందర్శించారు. పలువురు గ్రామస్తులు తమ ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఆర్‌అండ్‌బి ఏర్పాటు చేసిన మురుగు కాలువలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఇ.జాన్‌రాజు, సర్పంచి బాలాజీ నాయుడు, ఎంపిటిసి ఇంజేటి జూనియర్, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వినియోగదాల హక్కులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి – ఏలూరు

కొవ్వలి వినియోగదారుల సేవా మండలి ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని శుక్రవారం ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలి అధ్యక్షులు, న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సురక్షిత ఆహారం పొందే హక్కు, రక్షణ పొందే హక్కు, ఎంపిక చేసుకునే హక్కు, సమాచారం పొందే, నష్టపరిహారం పొందే హక్కు ప్రతీపౌరుడు కలిగి ఉంటారని తెలిపారు. సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఏ వస్తువు కొన్నా తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, కాలం చెల్లిన వస్తువులు కొనొద్దని, వస్తు సేవల లోపం జరిగినప్పుడు నష్టపరిహారం పొందేందుకు మండల స్థాయిలో తహశీల్దార్ కార్యాలయంలో, వినియోగదారుల సంఘాలను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.గిరిబాబు, సీనియర్ న్యాయవాది కూనా కృష్ణారావు, మానవత సంస్థ ఏలూరు ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్ కుమార్, వాల్ ఆఫ్ కైండ్ నెస్ ఫౌండర్ పివి.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై జనసేన పోరాటం

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

రైతుల సమస్యలపై జనసేన నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ పోలవరం నియోకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా కామయ్యపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కౌలు రైతులను గాలికి వదిలేసిందన్నారు. ఈ తరుణంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మూడు వేల మంది కౌలు రైతులకు సొంత డబ్బులు ఒక్కో రైతుకి రూ.లక్ష అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పసుపులేటి రాము, ఉపాధ్యక్షులు కొప్పుల శ్రీకాంత్, కర్రిపోతుల రాజకుమార్, ప్రధాన కార్యదర్శి బండారు అనిల్, వీరంకి వెంకటేశ్వరరావు, ఉలవల మధు, కోలా మధు, డేవిడ్ రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జనసేన పార్టీ రైతులకు అండగా ఉంటుందని చింతలపూడి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ మేకా ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం జాతీయ రైతు దినోత్సవాన్ని వేగవరంలో పొగాకు రైతు అనిశెట్టి వెంకన్నబాబు తోటలో మండల అధ్యక్షులు ఆకుల రాకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు మొటేపల్లి బసవరాజు, స్థానిక ఎంపిటిసి కుక్కల సత్యనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి గురుజు ఉమామహేశ్వరి, వీర మహిళ కోసూరి కనకమహాలక్ష్మి, షేక్ పీరు, చందు పాల్గొన్నారు.

భీమడోలు : జాతీయ రైతు దినోత్సవాన్ని జనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలులోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతులను కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జవాబుదారీ సేవలందించడమే సుపరిపాలన లక్ష్యం

ప్రజాశక్తి – ఏలూరు

జవాబుదారీతనంతో కూడిన సేవలను వేగవంతంగా ప్రజలకు అందించడమే సుపరిపాలన ప్రధానోద్దేశమని జిల్లా రెవెన్యూ అధికారి ఎవి.సత్య నారాయణమూర్తి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో శుక్రవారం గుడ్ గవర్నెన్స్‌పై వివిధ శాఖల అధికారులకు జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల్లో గుడ్ గవర్నెన్స్ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యఅతిథి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు అత్యుత్తమ పాలన అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వంటి చిన్న సేవలకు కూడా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, గుడ్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వాలు ఆధునిక సాంకేతిక వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోనే ఇంటి వద్ద నుండే ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ సేవలను పొందుతున్నారన్నారు. దీనివల్ల ప్రజలకు డబ్బు, సమయం ఆదా కావడంతోపాటు ప్రభుత్వం నుండి పారదర్శకమైన పాలనకు వీలు కలుగుతుందన్నారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ

ప్రజాశక్తి – ఆగిరిపల్లి

గోవులకు పశుగ్రాసాన్ని ఉచితంగా అందించడం అభినందనీయమని ఆగిరిపల్లి వేదపాఠశాల కార్యదర్శి సూరి శర్మ అన్నారు. నూగొండపల్లి గ్రామానికి చెందిన మారగాని వెంకటనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు మారగాని పూర్ణచంద్రరావు, సత్యనారాయణ, కోటేశ్వరరావు 500 గడ్డిచుట్టలను వేదపాఠశాలలోని గోవులకు పశుగ్రాసంగా అందించారు.

సీజ్డ్ వాహనాలు వేలం

ప్రజాశక్తి – చింతలపూడి

చింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేశామని ఎస్ఇబి డిఎస్‌పి అమర్‌బాబు తెలిపారు. మొత్తం 26 ద్విచక్రవాహనాలకు నిర్వహించిన వేలంపాటలో రూ.2.40 లక్షల నగదు, రూ.42,942 జిఎస్‌టి వచ్చిందని తెలిపారు.

'గౌడ సామాజిక తరగతికి ఎంఎల్ఎ క్షమాపణ చెప్పాలి'

ప్రజాశక్తి – నూజివీడు

గౌడ సామాజిక తరగతి ప్రజల జీవనోపాధికి మూలాధారమైన తాటి, ఈత చెట్ల హేళన చేస్తూ మాట్లాడిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని జై గౌడ సేన జాతీయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పేరం సత్యనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చెట్ల చరిత్ర తెలియకపోతే పెద్దల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఈ ఆధునిక కాలంలో కూడా శారీరక రుగ్మతలను తొలగించడంలో ముందుండి గౌడ జాతి గీత వృత్తికి ములాధారంగా ఉండే తాటి చెట్లను అవమానిస్తూ మాట్లాడిన ఎంఎల్ఎ యావత్ గౌడ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీల గొడవలు ఉంటే ఏమైనా మట్లాడుకోవాలి తప్ప గీత వృత్తిదారులు దైవంగా భావించే తాటి చెట్ల గురించి తప్పుడు మాటలు మాట్లాడటం దారుణమన్నారు. గౌడ జాతిని అవమానించిడమేనని వాపోయారు. ఎంఎల్ఎ క్షమాపణ చెప్పకపోతే గౌడ కులస్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి – నూజివీడు

ప్రేమించి ఆపై పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని మోసం చేసిన వ్యక్తిపై నూజివీడు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రావిచర్ల గ్రామానికి చెందిన యువతి(25)ని అదే గ్రామానికి చెందిన దేవరపల్లి సురేష్ ప్రేమించానని మాయమాటలుచెప్పి ఆమెను గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోమని అడగంతో సురేష్ ముఖం చాటేశాడు. దీంతో ఆమె జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇ-చలానాలు పెండింగ్ ఉండకూడదు

ప్రజాశక్తి – భీమడోలు

వాహనదారులు తమ స్మార్ట్‌ఫోన్లలో ఇ-చలానా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పెండింగ్ చలానాలను క్లియర్ చేసుకోవాలని ఎస్ఐ చావా సురేష్ సూచించారు. పెండింగ్ చలానాలపై భీమడోలులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తించిన 52 మంది వాహనదారులు పెండింగ్‌లో ఉన్న చలానాలను చెల్లించనట్లు గుర్తించారు. రూ.13,455 చలానాలు చెల్లించినట్లు తెలిపారు.

SUMMONS UNDER ORDER V RULE 20 CPC
IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT TANUKU
O.S.No.375 of 2022

Between:
Manthena Peddi Raju ...Plaintiff
And
Satti Srinivasa Reddy ...Defendant

To.
Defendant: Satti Srinivasa Reddy, S/o.Satyanarayana Reddy, Near Sai Baba Temple, Vemana Street, Kommara Village, Attili Mandal, Tanuku J.C.J.C.

Where as the PLAINTIFF has instituted asuit against you for recovery of amount. You are hereby summoned to appear in this Court in person or by a pleader duly instructed, and able to answer all material questions, relating to the suit, or who shall be accompanied by some person able to answer all such questions, on the **06th DAY OF JANUARY, 2023** at 10 O' Clock to answer the claim and as the day fixed for your appearance is appointed for the final disposal of the suit, you must be prepared to produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to rely in support of your defense. Take notice that, in default of your appearance on the day before mentioned, the suit be heard and determined in your absence.

Rayaprolu Raja Kiran,
R.A.Begum, Advocates,
Tanuku-534 211,
Cell:8341437279

Tanuku,
23/12/2022

ప్రకటన
IN THE COURT OF THE 1st ADDL JUNIOR CIVIL JUDGE - TANUKU
O.S.No.512/2022

Between:
వాది: కోమట్లపల్లి సుధాకర చౌదరి
మరియు
ప్రతివాది: సోడదాసి యాకోబు,
తండ్రి: స్యాముయల్, డోర్.9-8-8,
బ్రిడ్జ్‌పేట, గునుపూడి విలేజ్, భీమవరం,
వెస్ట్ గోదావరి జిల్లా – B.J.C.J.C.

పై నెంబరు దావాలో ప్రతివాది ఐనా సోడదాసి యాకోబు గార్కి, దావా సంగతులు తెలియచేస్తు దావా సమన్లు కోర్ట్ ద్వారనున్ను, రెజిస్టర్డ్ పోస్ట్‌లో నున్ను ఎన్నిసార్లు పంపినను తీసుకొనక Avoid చేయూస్తున్నందున్న మీరు దావాలో వాయిదా ది.05-01-2023 ఉదయం 10.30 లకుపై కోర్ట్ వారి యెదుట హాజరు అయి ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల మీ పరోక్షంగా తీర్మానం చేయుదురనియు ప్రకటన ద్వారా తెలుపడమైనది.

By order of Court
MOSALI VENKATESWARLU M.A.,L.L.B.,B.Ed.
Advocate, Tanuku, W.G.Dt.
Cell:80193 01232

తణుకు
22-12-2022